ప్రజాశక్తి
శుక్రవారం 6 అక్టోబర్ 2023
8 పేజీలు


విశాఖపట్నం


అనకాపల్లి

బిగిసిన ఉక్కు పిడికిలి

- ఉత్తేజం నింపిన సిపిఎం బహిరంగ సభ
- వేలాదిగా తరలివచ్చిన ఉక్కు కార్మికులు, ప్రజలు
- స్టీల్‌ప్లాంట్‌ను ఐక్య పోరాటాలతో కాపాడుకుంటాం : సీతారాం ఏచూరి, వి.శ్రీనివాసరావు ప్రభృతులు
- బిజెపి కుట్రలపై వైసిపి, టిడిపి, జనసేన మౌనం వీడాలని డిమాండ్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, గాజువాక

సిపిఎం ఆధ్వర్యాన కూర్మన్నపాలెం సమీపంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద గురువారం జరిగిన ఉక్కు రక్షణ బహిరంగ సభ ప్రజల్లో చైతన్యం నింపింది. ఉత్తరాంధ్ర నుంచి ఈ సభకు వేలాది మంది కార్మికులు, ప్రజలు తరలివచ్చారు. సుదూర ప్రాంతాల నుంచి విభిన్న ప్రభావంతులు, వృద్ధులూ కదిలివచ్చారు. త్యాగాలతో సాధించు కున్న ఉక్కు కర్మాగారాన్ని మోడీ ప్రభుత్వ కుట్రల నుంచి ఐక్య పోరాటాలతో కాపాడుకోవాలని సభా వేదిక నుంచి నేతలు పిలుపునిచ్చారు. 'ఉక్కూ మనదే.. హక్కూ మనదే, విశాఖ ఉక్కు.. ప్రజల హక్కు' అని నేతలు అనగానే ప్రజలూ గొంతు కలిపి బిగ్గరగా నినదించారు. దీంతో ఉక్కు నినాదం పారిశ్రామిక ప్రాంతంలో మార్మోగింది.


సభకు హాజరైన వేలాది మంది ప్రజలు, కార్మికులు

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలంటే కేంద్రంలో బిజెపిని 2024 ఎన్నికల్లో ప్రజలు అధికారానికి దూరం పెట్టాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆస్తిని మేనేజర్లుగా వ్యవహరిస్తున్న పాలకులు ఎలా అమ్మేస్తారని ఆయన అనగానే సభలో చప్పట్ల వర్షం కురిసింది.


అభివాదం చేస్తున్న సీతారాం ఏచూరి, వి.శ్రీనివాసరావు, సిహెచ్.నర్సింగరావు, లోకనాథం, సురేంద్ర, ప్రభావతి, జగ్గునాయుడు, సిపిఎం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శులు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

అంధకారంలోకి దేశం : వి.శ్రీనివాసరావు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అభివృద్ధి నినాదంతో మోడీ అధికారంలోకి వచ్చి దేశాన్ని అంధకారంలోకి నెట్టాడని విమర్శించారు. ఇలాంటి ప్రజా ఉద్యమ సభలతో మోడీ కార్మిక వ్యతిరేక విధానాలకు సమాధానం చెబుతామన్నారు. రాష్ట్రాన్ని అదానీ, అంబానీలకు దోచిపెట్టేందుకు చూస్తున్నారని విమర్శించారు. రూ.3 లక్షల కోట్ల విలువైన స్టీల్‌ప్లాంట్ సంపదపై వారి కళ్లు పడ్డాయని తెలిపారు. రూ.50 వేల కోట్లను ఇప్పటివరకూ స్టీల్‌ప్లాంట్ పన్నుల రూపంలో కేంద్రానికి కట్టిందని, దీన్ని అమ్మే హక్కు బిజెపికి ఎక్కడిదని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో వైసిపి, టిడిపి, జనసేన మౌనం తగదన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను మిగతా 2లో..

మహిళలు వ్యాపార రంగాల్లో రాణించాలి

వార్త 4లో..

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

వార్త 8లో..

యువశక్తిని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

వార్త 8లో..

త్వరలో 4జి సేవలు విస్తృతం

- నేటికీ ల్యాండ్‌లైన్‌కు తగ్గని ఆదరణ
- ఎపి టెలికం సర్కిల్ సిజిఎం శేషాచలం


మాట్లాడుతున్న శేషాచలం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : త్వరలో బిఎస్‌ఎన్‌ఎల్ 4జి సేవలు రాష్ట్రంలో విస్తృతం కానున్నట్టు భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ ఎపి చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.శేషాచలం తెలిపారు. బిఎస్‌ఎన్‌ఎల్‌ను అందరూ ఉపయోగించడమే కాకుండా ప్రోత్సహించాలని కోరారు. విశాఖ పర్యటనలో భాగంగా ఆయన గురువారం డాబాగార్డెన్స్‌లోని బిఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. దేశంలో ఎన్ని ప్రైవేట్ ఆపరేటర్ల సేవలు అందుబాటులో ఉన్నా బిఎస్‌ఎన్‌ఎల్‌కు ఇప్పటికీ ఆదరణ తగ్గలేదని అన్నారు. వినియోగదారుల భద్రత తమ వద్ద కచ్చితంగా ఉంటుందని ఆయన భరోసానిచ్చారు. ఇంట్లో ఉన్న వృద్ధులను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికీ ల్యాండ్‌లైన్ సేవలను కొనసాగిస్తున్నామని తెలిపారు. ఎటువంటి రేడియషనూ లేని, అపాయమూ లేని సేవలు ల్యాండ్ లైన్ ద్వారా అందుతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాల సిబ్బంది కచ్చితంగా బిఎస్‌ఎన్‌ఎల్ సేవలనే ఉపయోగించుకోవాలని పదే పదే చెబుతున్నా అనివార్య కారణాల వల్ల కొన్ని సంస్థలు ఇతర ప్రైవేట్ ఆపరేటర్ల సేవలు ఉపయోగించుకోవడం వాస్తవమేనన్నారు. ప్రైవేట్ ఆపరేటర్ల నుంచి ఎలాంటి పోటీ ఉన్నా ఎదుర్కొనేందుకు మిగతా 2లో..

ప్రపంచ గతిని మార్చేసిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్
- ఘనంగా అంతరిక్ష వారోత్సవాలు ప్రారంభం



ప్రారంభ సభలో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి - తగరపువలస : నేడున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచ గతినే మార్చేసిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్ (షార్), భారతీయ అంతరిక్ష పరిశోధనా కేంద్రం (ఇస్రో) ఆధ్వర్యాన భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాల వేదికగా నాలుగు రోజుల పాటు జరగనున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఎస్‌డిఎస్‌సి, షార్, ఇస్రో డిప్యూటీ డైరెక్టర్ జి.రమేష్ బాబు, విశాఖ రీజియన్ సబ్ కమిటీ చైర్మన్ జి.అప్పన్న తదితరులతో కలిసి మంత్రి అమర్‌నాథ్ జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనేక అంతరిక్ష పరిశోధనల నేపథ్యంలో ఇస్రో, షార్ దేశానికే గర్వకారణంగా నిలుస్తున్నాయని అన్నారు. చంద్రయాన్ విజయవంతం కావడంతో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఎంత గొప్పదో ఇట్టే రుజువైందని, తద్వారా ప్రపంచ దేశాలన్నీ భారత దేశం వైపు చూస్తు న్నాయని స్పష్టం చేశారు స్టార్టప్ రంగం దిశగా యువత అడు గేయాలని పేర్కొన్నారు. జి.రమేష్ బాబు మాట్లాడు తూ దేశ భవిష్యత్ అంతరిక్ష పరిశోధనలపై ఆధారపడి ఉంటుందనే వాస్తవాన్ని అందరూ గమనంలో ఉంచుకోవాలన్నారు. రఘు ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కలిదిండి రఘు మాట్లాడుతూ షార్, ఇస్రో ఉత్తరాంధ్ర యువతకు ఉపయుక్తంగా ఈ కార్యక్రమ నిర్వహణ జరుగుతోందన్నారు. అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు ఫొటోగ్రఫీ పోటీలు, యుజి, పిజి విద్యార్థులకు తొలి దశ క్విజ్ పోటీలు జరిగాయి

బీచ్ రోడ్డులో ర్యాలీ

విశాఖ కలెక్టరేట్ : అంతరిక్ష పరిశోధన రంగంలో యువత తమ సత్తా చాటాలని డిసిపి-2 కె.ఆనందరెడ్డి అన్నారు. వరల్డ్ స్పేస్ వీక్‌లో భాగంగా షార్ - ఇస్రో, రఘు విద్యాసంస్థలు సంయుక్తంగా గురువారం ఆర్కే బీచ్ కాళీమాత విగ్రహం వద్ద నిర్వహించిన స్పేస్ వాక్ అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి మిగతా 2లో..

బిగిసిన ఉక్కు పిడికిలి

(మొదటి పేజీ తరువాయి..) ఉరివేస్తానంటే తాడును జగన్ అందిస్తాడా ? అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. జనసేన అధినేత పవన్ తన రెండు చేతుల్లో ఒకదాన్ని టిడిపి, రెండోదాన్ని బిజెపి చేతిలో పెట్టాడని, అక్కడ చేతులు తీసి ప్రజలతో కలిస్తే మంచిదని హితవు పలికారు. ఉత్తరాంధ్ర ప్రజలు ఉత్త ప్రజలు కాదని ఉత్తేజితులై పోరాడితే ఈ ప్రాంతంలో ఎవరూ అడుగుపెట్టలేరని ఆ పార్టీలను హెచ్చరించారు. ఢిల్లీకి బయల్దేరిన సిఎం జగన్ అక్కడ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని అడిగితే ప్రజలు హర్షిస్తారని తెలిపారు. మోడీ విజన్ నచ్చిందంటూ చంద్రబాబు ఆ మధ్య సభలో ప్రకటించారని, ఆయన వినాశకర విజన్ ఎలా నచ్చింది 'బాబూ' అంటూ ప్రశ్నించారు. జగన్ త్వరలో విశాఖలో కాపురానికి వస్తున్నట్లు ప్రకటన చేశారని, విశాఖ ప్రజలు ఆయన రాకకోసం ఎదురు చూడడం లేదన్న సంగతి గుర్తెరగాలని అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా ఏం చేస్తారో అది చెప్పాలని ఇక్కడి వారు అడుగుతున్నారన్నారు. సిపిఎం, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, ప్రజా, కార్మిక సంఘాలు స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం పోరాడుతున్న తీరును అభినందించారు.

ఉక్కును బలహీన పరిచే కుట్రలను తిప్పికొట్టాలి : సిహెచ్.నర్సింగరావు

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను బలహీనపరిచేందుకు కుట్రలు పన్నుతోందని, అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందని అన్నారు. బ్లాస్ట్ ఫర్నేస్ 3ని అత్యంత దారుణంగా మూసివేశారన్నారు. దీంతో ఉత్పత్తి తగ్గి కర్మాగారం నష్టాలోకి వెళ్తోందని అన్నారు. సొంత గనులు లేకపోవడంతో తీవ్ర ఇక్కట్లు ఎదురవుతున్నాయన్నారు. ఎన్ఎండిసి నుంచి గనులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు.

ఉక్కు యాత్రకు ఉత్తరాంధ్రలో విశేష స్పందన : కె.లోకనాథం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ తాము ఉత్తరాంధ్రలో ఉక్కు రక్షణ బైకు యాత్ర చేసినప్పుడు అన్ని తరగతుల నుంచీ విశేష స్పందన లభించిందన్నారు. రైతులు, విద్యార్థులు మీ పోరాటానికి మేము అండగా ఉన్నామని, తగ్గేది లేదని పేర్కొంటూ స్ఫూర్తినిచ్చారన్నారు. బిజెపి ఎంపీ జివిఎల్ నరసింహారావు ఒక బ్రోకర్‌లా వ్యవహరించి విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కుట్రలు పన్నుతున్నారన్నారు. కల్లబొల్లి కబుర్లతో ప్రజలను ఏమార్చాలని చూస్తున్నారని విమర్శించారు.

భావోద్వేగానికి లోనైన ఏచూరి

సభకు ముఖ్య అతిథిగా హాజరైన సీతారాం ఏచూరి తాను మాట్లాడుతూ ఓ దశలో భావోద్వేగానికి లోనయ్యారు. 'నేను అత్యంత ఉద్వేగపూరితంగా పెరిగాను. అప్పట్లో 'విశాఖ ఉక్కు-మన హక్కు' అంటూ నినాదాలు చేశాం. ప్లాంట్ సాధనలో కమ్యూనిస్టులదే కీలకపాత్ర. ఆ రోజుల్లో పుచ్చలపల్లి సుందరయ్య, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజీనామాలు చేశారు. అలా ఒత్తిడి తేవడంతో వచ్చినదే ఈ ప్లాంట్. ఇది దేశ సంపద. ఏ రాష్ట్రానిదో కాదు. నేను ఆ భావనతోనే పెరిగి ఇంత పెద్దయ్యాను. మీ ఉక్కు సంకల్పానికి నా బాధ్యత, సహకారం ఎల్లవేళలా ఉంటుంది' అని ఏచూరి చెప్పారు.

అడుగుపెట్టలేకపోయిందని అన్నారు. అది పోరాట విజయమని పేర్కొన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.ప్రభావతి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే దమ్ము మోడీకి లేదన్నారు. సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ ఉక్కు జోలికొచ్చిన వారికి పుట్టగతులుండవన్నారు. సభలో సిపిఎం ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శులు టి.సూర్యనారాయణ, రెడ్డి వేణు, డి.గోవిందరావు, ఎం.జగ్గునాయుడు, పి.అప్పలనర్స, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కెఎస్ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, సిపిఎం నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, కెఎం.శ్రీనివాసరావు, బి.జగన్, బి.ఈశ్వరమ్మ, బి.పద్మ, కె.శ్రీనివాసరాజు, స్టీల్ సిఐటియు నాయకులు యు.రామస్వామి, వైటి.దాస్, జి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

బిజెపితో అందరికీ నష్టం : కిల్లో సురేంద్ర

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ బిజెపితో ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతోందని అన్నారు. మోడీ సర్కారు అటవీ చట్టాల్లో మార్పులు చేసి గిరిజనులకు మనుగడ లేకుండా చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగాన్ని అమ్మకానికి పెట్టడంపై మండిపడ్డారు.

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ విశాఖ ఉక్కుకు విలువ కట్టడానికి వచ్చిన కమిటీ కార్మికుల ఆగ్రహానికి గురై లోపలకు

ఆకట్టుకున్న కళారూపాలు

సభా వేదికపై ప్రజానాట్య మండలి కళాకారుల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎవ్వడురా అమ్మేది, ఎవ్వడురా కొనేది పాట చైతన్యం రేకెత్తించింది. మహిళా కళాకారుల ప్రదర్శనలకు చప్పట్ల వర్షం కురిసింది. ఇటీవల ఉక్కు రక్షణ బైకు యాత్రలో పాల్గొన్న వారికి అతిథులు మెమెంటోలు అందజేశారు.

ఉక్కు రక్షణ పోరాటానికి 'ఇండియా' మద్దతు



ఏచూరికి వినతిపత్రం అందజేస్తున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు జరుగుతున్న పోరాటానికి ఇండియా వేదిక మద్దతునిస్తోందని సీతారాం ఏచూరి అన్నారు. ప్లాంట్ పరిరక్షణకు ఇండియా సహకరిస్తుందని తెలిపారు. గురువారం ఉక్కు హౌస్‌లో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు ఏచూరిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ప్లాంట్ పరిరక్షణకు సిపిఎం చేస్తున్న పోరాటాన్ని, కృషిని ప్రతినిధులు కొనియాడారు. ఈ సందర్భంగా ఏచూరి మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ సాధనకు సుందరయ్య పోరాడారని గుర్తు చేశారు. ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి సిపిఎం సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్.నరసింగరావు, కో - కన్వీనర్ జె.అయోధ్యరాం, నీరుకొండ రామచంద్రరావు, కెఎస్ఎన్.రావు, వి.రామ్మోహన్ కుమార్, మస్తానప్ప, పరందామయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

త్వరలో 4జి సేవలు విస్తృతం

బిఎస్ఎన్ఎల్ ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుందన్నారు. రూ.కోట్ల మూలధనంతో పాటు చెల్లింపు మూలధనాన్ని కలిగి ఉన్న సంస్థ తమేదనన్నారు. టెలికం రంగంలో అనేక సేవలందిస్తున్న తమ సంస్థలో అన్నిచోట్లా 4జి సేవలు అందుబాటులోకి రానప్పటికీ ఆదాయంలో నిలకడగానే ఉన్నామన్నారు. గతేడాది 14 శాతం ఆదాయాన్ని రాబట్టగలిగామన్నారు. ఎపిలోనూ 10 శాతం లాభాలతో రూ.700 కోట్ల ఆదాయం కలిగి ఉన్నట్టు తెలిపారు. మారుమూల గ్రామాల్లోనూ సేవలందించేందుకు 4జి స్యాచురేషన్ ప్రాజెక్టు సిద్ధమైందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జిఎం పి.పాల్ విలియమ్స్, పిజిఎం ఆపరేషన్స్ జి.ఆదామ్, సెల్ వన్ జిఎం (విజయవాడ) ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రపంచ గతిని మార్చేసిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం

ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనలతో భారత్ ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో షార్ శాస్త్రవేత్త, విశాఖ రీజియన్ కార్యక్రమ నిర్వహణ సబ్ కమిటీ చైర్మన్ జి.అప్పన్న, రఘు విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘు, పలువురు శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా స్వర్ణపుష్పార్చన

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచల దేవస్థానంలో గురువారం స్వర్ణ పుష్పార్చన కార్యక్రమాన్ని వైదిక వర్గాలు వైభవంగా నిర్వహించాయి. ముందుగా గోవిందరాజు స్వామి, శ్రీదేవి భూదేవి సమేతంగా ప్రత్యేక మండపంలో ఉంచారు. స్వామి బాండాగారంలో ఉన్న స్వర్ణ పుష్పాలతో ప్రత్యేక పూజ జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు సునీల్ వర్మ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రిజిస్ట్రార్‌కు కృష్ణమూర్తి అభినందనలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎయు నూతన రిజిస్ట్రార్‌గా నియమితులైన ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌ను స్టూడెంట్స్ యునైటెడ్ నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు బసవ కృష్ణమూర్తి గురువారం ఎయులో రిజిస్ట్రార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు కె.నరేష్, మహమ్మద్ ఇషాక్, సుధాకర్ పట్నాయక్, కొయ్య రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జనసేన బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి -మధురవాడ : ప్రమాదానికి గురైన జనసేన క్రియాశీలక సభ్యుడు కొరగంజి అనిల్‌కుమార్‌కు పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ స్వయంగా సంతకం చేసి పంపించిన రూ.20 వేల ఇన్సూరెన్స్ చెక్కును పార్టీ భీమిలి నియోజకవర్గ ఇంఛార్జి సందీప్ పంచకర్ల గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శాఖరి శ్రీనివాస్, చంద్ర సత్యనారాయణ, బివి.కృష్ణయ్య, 8వ వార్డు జనసేన నాయకులు పాల్గొన్నారు.

గీతం దూరవిద్య కోర్సుల ప్రవేశ గడువు పొడిగింపు

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల సెంటర్ ఫర్ డిస్టెన్స్ లెర్నింగ్ (సిడిఎల్) ఆధ్వర్యాన దూర విద్యా విధానంలో ఎమ్ఎ ఇంగ్లీష్, బిఎ, బికామ్ డిగ్రీ కోర్సులలో 2023 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు సిడిఎల్ డైరెక్టర్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఈ కోర్సులలో ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తు గడువును అక్టోబర్ 20వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. గృహిణులు, ఉద్యోగస్తులు దూర విద్యా విధానంలో ఈ కోర్సులను అభ్యసించే విధంగా ఏర్పాట్లుచేసినట్లు వెల్లడించారు. పూర్తి సమాచారం, ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం cdlgitam.edu వెబ్‌సైట్‌ను పరిశీలించాల్సిందిగా సూచించారు. విశాఖ నగరానికి చెందిన దొండపర్తిలోని గీతం సిడిఎల్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చునని తెలిపారు. అతి తక్కువ ఫీజుతో నిర్వహిస్తున్న ఈ కోర్సులలో ప్రవేశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దుర్గాదేవి నవరాత్రి రాట మహోత్సవం

ప్రజాశక్తి -గాజువాక : శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా జివిఎంసి 74వ వార్డు పరిధి దళ్లివానిపాలెంలో శ్రీ నూకంబిక సేవా సంఘం ఆధ్వర్యాన పందిరి రాట మహోత్సవాన్ని నిర్వహించారు. 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, స్థానిక పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొని పూజలు నిర్వహించి రాట వేశారు. ఈ కార్యక్రమంలో గొందేసి సత్యారావు, దళ్లి పైడికొండ, గొందేసి అప్పారావు, పాల శ్రీను, సిహెచ్.శ్రీనివాసరెడ్డి, సునీత తదితరులు పాల్గొన్నారు.

'గీతం' మూట్ కోర్టు పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యాన జాతీయ స్థాయి మూట్ కోర్టు పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. గీతం మూట్ అడ్వకసీ కమిటీ ఆధ్వర్యాన ఈ నెల 8వ తేదీ వరకు గీతం వ్యవస్థాపక అధ్యక్షులు కీర్తిశేషులు డాక్టర్ ఎమ్‌వివిఎస్.మూర్తి పేరుతో ఈ పోటీలను వర్చ్యువల్ విధానంలో ప్రముఖ న్యాయ నిపుణుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. పోటీలను లాంఛనంగా ప్రారంభించిన గీతం ప్రో వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ, మూట్‌కోర్టు పోటీల నిర్వహణ ద్వారా విద్యార్థుల ప్రతిభను వెలికి తీయవచ్చున్నారు. న్యాయ విద్యను అభ్యసించే యువతకు వృత్తిలో ప్రవేశించడానికి ముందు ప్రాక్టికల్ శిక్షణగా మూట్‌కోర్టు పోటీలు ఉపయోగపడతాయన్నారు. చట్టాలను లోతుగా అర్థం చేసుకుని సందర్భానికి తగిన విధంగా అన్వయించుకోవడానికి తగ్గ నైపుణ్యం మూట్ కోర్టు పోటీల ద్వారా కలుగుతుందని తెలిపారు. విద్యార్థుల మధ్య జరిగే చర్చల ద్వారా నూతన ఆలోచనలకు మార్గం ఏర్పడుతుందని తెలిపారు.

విశాఖపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వి.రవీంద్రప్రసాద్ మాట్లాడుతూ, సామాన్యులకు సహితం న్యాయం జరుగుతుందన్న నమ్మకాన్ని న్యాయవ్యవస్థ ద్వారా ప్రజలలో పెంచాల్సిన బాధ్యత యువతరంపై ఉందన్నారు. గీతం న్యాయ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ అనితారావు మాట్లాడుతూ కృత్రిమ మేధ, ఐపిఆర్ చట్టాల పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ నెల 8వ తేదీన జరిగే ఫైనల్స్‌లో విజేతలను ఎంపిక చేసి నగదు బహుమతి అందజేస్తామన్నారు. పోటీల వివరాలను మూట్ కోర్టు పోటీల నిర్వహణ కమిటీ కన్వీనర్ వర్ధమాన్ పావ వివరించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 34కి పైగా ప్రముఖ న్యాయ విశ్వవిద్యాలయాల నుంచి దాదాపు 400 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనున్నారని తెలిపారు.

వాలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు తగవు

ప్రజాశక్తి- పిఎం పాలెం : సేవాగుణంతో ప్రజలకు సేవలందిస్తున్న వాలంటీర్లను రాజ్యాంగ వ్యతిరేకులుగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు చేయడం సరికాదని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మధురవాడ శిల్పారామంలో గురువారం 5, 6, 7 వార్డుల వాలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లతో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' అన్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివృద్ధిని ఇంటింటికి వెళ్లి తెలియజేయాలన్నారు. అనంతరం 5వ వార్డులోని పలు ప్రాంతాల్లో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఏపీ నగరాల కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పిల్లా సుజాత, ముత్తంశెట్టి నందిష్, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, 6, 7వార్డుల అధ్యక్షులు బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, గాదె రోశిరెడ్డి, గుంటుబోయిన సంజీవ్‌కుమార్, శియ్యద్రి కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం వేములవలస మార్కెట్ సమీపంలోని బిసి కాలనీలోని ఇంట్లో బూర్లి లక్ష్మణ (30) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు, పోలీసుల కథనం ప్రకారం... గురువారం ఉదయం మేడపై నుంచి 8:45 గంటలైనా లక్ష్మణ కిందికి రాకపోవడంతో యువకుని తల్లి సరస్వతి మేడ మీదకు వెళ్లారు. టెంట్ హౌస్‌లో చీరతో ఉరివేసుకొని మృతి చెంది ఉండడాన్ని గమనించి బోరున విలపించింది. బూర్లి జగదీష్, సరస్వతి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారులిద్దరూ కవల పిల్లలు. రామునాయుడు, లక్ష్మణ్. లక్ష్మణ్ 8 సంవత్సరాల క్రితం బీటెక్ పూర్తి చేసి ఐటి ఉద్యోగంలో చేరాడు. కరోనా కారణంగా ఉద్యోగం కోల్పోయి ఇంటికి చేరుకున్నాడు. తండ్రి నిర్వహిస్తున్న కూరగాయలు, పువ్వుల వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రామునాయుడు మహారాష్ట్రలో ఉద్యోగం చేస్తున్నాడు.

బీటెక్ చదివి సరైన ఉద్యోగం లేక మనస్తాపంతో లక్ష్మణ్ ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని కుటుంబ సభ్యులు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతుని తండ్రి బూర్లి జగదీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిర్వహించి ఆనందపురం ఎస్ఐ శ్యాంసుందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గోస్తనీలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పద్మనాభం పంచాయతీ పరిధి ఇసుకలపాలెం గ్రామానికి చెందిన బుచ్చిబాబు (45) బుధవారం సాయంత్రం గోస్తనీ నదిలో కాలుజారి పడి మృతిచెందాడు. గురువారం శవ పంచనామా చేసి భీమిలి ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు పద్మనాభం ఎస్ఐ నక్క శ్రీనివాసరావు తెలిపారు.

పలుచోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి-యంత్రాంగం

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు గురువారం పలుచోట్ల నిర్వహించారు. వైద్యులు తనిఖీలు నిర్వహించిన ఉచితంగా మందులు పంపిణీచేశారు.

పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, సర్పంచ్ బి.సన్యాసమ్మ, వైసిపి నాయకులు సత్యానారాయణ, ఏరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలం చందక గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మెగా ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు ఎం.గంగునాయుడు, షేక్ సహనాజ్, కెజిహెచ్ స్పెషలిస్ట్ డాక్టర్లు హాజరై 524 మంది రోగులకు తనిఖీ నిర్వహించారు. ఆధునిక చికిత్స అవసరమైన వారిని విశాఖపట్నంలోని వివిధ ఆసుపత్రులకు సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బంక శ్రీను, వైసిపి నాయకులు బంక సత్యం, మజ్జి వెంకట్రావు, ప్రోగ్రాం స్పెషల్ ఆఫీసర్ పద్మ, ఎండిఓ లోవరాజు, తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి 8వ వార్డు పరిధి సాగర్‌నగర్‌లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, వార్డు కార్పొరేటర్ ఎన్.అప్పారావు, గుడ్ల పోలిరెడ్డి, అల్లాడు ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు పరిధి ఎన్జీవోస్ కాలనీలో 14, 26, 45, వార్డులకు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జోన్ -3 ఎఎంఓహెచ్ రాజేష్ తెలిపారు. సభా ప్రాంగణాన్ని గురువారం ఆయన పరిశీలించారు. వైద్యులకు, నర్సులకు పలు సూచనలు చేశారు.

నర్సీపట్నంటౌన్:జగనన్న సురక్షతో ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యం ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ తెలిపారు. మున్సిపాలిటీ పెదబడ్డేపల్లిలో గురుకుల పాఠశాలలో జగనన్న సురక్ష కార్యక్రమం గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రజల చెంతకే వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.

చీడికాడ:ప్రజల ఆరోగ్యంపై సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక



అంగన్‌వాడీ స్టాళ్లను పరిశీలిస్తున్న ఎంపిపి సూరిబాబు

శ్రద్ధ తీసుకుంటున్నారని మండల అధ్యక్షులు కురచ జయమ్మ తెలిపారు. మండలంలోని జె.జైతవరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్షను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు గొల్లవిల్లి రాజబాబు, మండల సచివాలయం కన్వీనర్, ఈర్లే చైతన్య, ఎంపిడిఓ జయప్రకాశరావు, వైద్యాధికారులు సునీల్ కుమార్, దాడి అప్పారావు నాయుడు, మండల విద్యాశాఖ అధికారి బొంజుబాబు, పంచాయతీ కార్యదర్శి, పట్నాల గోపి పాల్గొన్నారు.

కోటవురట్ల:రామచంద్రపాలెంలో నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 250 మంది రోగులను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, ఎంపీటీసీ సభ్యులు రాంబాబు, వైసీపీ నాయకులు తమరాన కన్నబాబు, ఆరోగ్య విస్తరణాధికారి గోవిందరావు పాల్గొన్నారు.

నక్కపల్లి:జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గొల్ల బాబురావు అన్నారు. మండలంలోని రేబాక గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పేద ప్రజలకు సంపూర్ణమైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. వైద్యులు రోగులను పరీక్షించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో సీతారామరాజు, సర్పంచ్ సాది రెడ్డి శ్రీనివాసరావు, వైసీపీ మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, కాసుబాబు పాల్గొన్నారు .

అనకాపల్లి : మండలంలోని మార్టూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్నిగురువారం ఎంపిపి గొర్లి సూరిబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ హేమంత్, ఎంపీడీవో నరసింహారావు, సర్పంచ్ కరణం రెవెన్యూ నాయుడు, ఎంపీటీసీ మిద్దే రామ చంద్రరావు, మాకవరం సర్పంచ్ మొయ్య భవాని నూకరాజు, వైసీపీ నాయకులు పొల్నాటి కాసుబాబు, దంట్ల ప్రకాశ్, బెత ప్రవీణ్, ఓమ్మి మధుబాబు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని నాయుడుపాలెం పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు, వైసిపి నాయకులు కోన రామారావు, వెన్నెల సన్యాసిరావు, ఆ గ్రామ సర్పంచ్ కుంద్రాపు వరలక్ష్మి సీతారామయ్య, కో ఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని ఎ.కోడూరులో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ప్రారంభించారు. వైద్యులు సాయికిరణ్, రామారెడ్డి, నిర్మల, చంద్రశేఖర్, శైలజ సురేష్ వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, సర్పంచ్ బొడ్డు అక్క నాయుడు, ఎంఈఓ-2 ప్రసాద్, హెల్త్ సూపర్వైజర్లు జవ్వాది సన్యాసిరావు, ప్రమీల, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి వెంకటకృష్ణ, తహశీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సువర్ణరాజు, జెడ్పిటిసి దొండ రాంబాబు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని బయ్యవరంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి సందర్శించారు. ఆమె వైద్య పరీక్షలు చేసి ముందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విష్ణుమూర్తి, ఎంపిపి కలగా లక్ష్మీగున్నయ్య నాయుడు, నాయకులు గొల్లవిల్లి శ్రీనివాసరావు, మలసాల కిషోర్, గొన్న నాగసత్యనారాయణ, వైద్యులు తిరుపతిరావు, యశోద పాల్గొన్నారు

అచ్యుతాపురం : మండలంలోని పూడిమడక గ్రామంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కన్నబాబురాజు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చేపల సుహాసిని, మాజీ సర్పంచ్ చేపల వెంకటరమణ, ఉప సర్పంచ్ గంగిరి రవి పాల్గొన్నారు.

మహిళలు వ్యాపార రంగాల్లో రాణించాలి

మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మహిళా పారిశ్రామిక వేత్తల వర్క్‌షాపులో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి-విశాఖపట్నం : మహిళలు వివిధ వ్యాపార రంగాలలో విభిన్న ఆలోచనలతో ముందుకు సాగాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సూచించారు. రాడిసన్ బ్లూ హోటల్‌లో గురువారం మహిళా పారిశ్రామిక వేత్తల వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి అమర్‌నాథ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో పారిశ్రామికాభివృద్ధి జరుగుతోందని, మహిళా పారిశ్రామిక వేత్తలకు అవసరమైన పూర్తి సహాయ సహకారాలను అందిస్తోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 36 ఇంక్యుబేషన్ సెంటర్లు ఉన్నాయన్నారు. ఎంటర్‌ప్రెన్యూర్స్ విజయవంతం కావడానికి మెంటారింగ్, నెట్ వర్కింగ్ ముఖ్యమైన అంశాలని వివరించారు. రాష్ట్రంలో విశాఖ, విజయవాడ, తిరుపతి పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నాయని నాన్నామ్ పేర్కొందని తెలిపారు. కొత్తగా పారిశ్రామిక రంగంలో అడుగు పెట్టిన వారు ఎన్నో అపజయాలను ఎదుర్కొంటారని, దాని నుంచి వారు పాఠాలు నేర్చుకొని ముందుకు సాగి విజయాలను సొంతం చేసుకోవాలని సూచించారు.

ఐటి విభాగం కార్యదర్శి కోన శశిధర్ మాట్లాడుతూ మహిళా పారిశ్రామికవేత్తలతో వర్క్‌షాప్ నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి, పరిశ్రమల శాఖ మంత్రి ఆదేశాలు, సూచనలతో రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన, అభివృద్ధి ఎంతగానో జరుగుతోందన్నారు. ఎక్కడైనా మహిళలు ఫౌండర్స్‌గా ఉన్న చోట అభివృద్ధి ఉంటుందన్నారు. సాంకేతికపరిజ్ఞానంతో వ్యాపారంలో అభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఎపి ఇన్నోవేటివ్ సొసైటీ కింద ఎన్నో ప్రణాళికలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో పారిశ్రామిక వేత్తల కోసం 65వేల చదరపు అడుగుల స్థలం అందుబాటులో ఉందని చెప్పారు. ఎపి స్టార్టప్ పోర్టల్‌లో అన్నిఅంశాలు ఉంటాయన్నారు.

వ్యాపారంలో రాణించాలంటే మంచి ఆలోచన, బిజినెస్ స్కిల్స్, స్పీకింగ్ నైపుణ్యాలు ఉండాలన్నారు. అవకాశాలు పట్టణ, గ్రామీణ తేడాలు ఉండవని, అందరికి సమానంగా ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం మంత్రి అమర్‌నాథ్ సమక్షంలో కోన శశిధర్, పలువురు పారిశ్రామిక వేత్తలతో ఎంఒయులను కుదుర్చుకున్నారు. ఎడ్వంచర్ స్కూల్ ప్రయివేట్ లిమిటెడ్, ఎన్జనీ వెంచర్స్ ప్రయివేట్ లిమిటెడ్, హెడ్ స్టార్ట్ నెట్ వర్క్ ఫౌండేషన్, వుయ్ ఫౌండర్ సర్కిల్ ప్రయివేట్ లిమిటెడ్ తదితర కంపెనీలు ప్రభుత్వంలో ఎంఒయులు చేసుకున్నాయి.

ఈ కార్యక్రమంలో ఐటాప్ ప్రెసిడెంట్ లక్ష్మి ముక్కవిల్లి, నాస్కామ్ సిఇఒ సంజీవ్ మల్హోత్రా, నీతి ఆయోగ్ మెంబర్ యశోదరా బజోరియా, ఎన్‌టిపిఐ విశాఖపట్నం అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సురేష్ బాతా, ఎన్ఆర్‌డిసి డెవలప్‌మెంట్ ఇంజినీర్ సుధ, పలువురు మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -మధురవాడ : కళాకారులు గుర్తింపు కార్డులను సద్వినియోగం చేసుకోవాలని వైసిపి సాంస్కృతిక విభాగం అధ్యక్షులు వంగపండు ఉష కోరారు. ఎండాడలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, కళలను అభివృద్ధి చేస్తూ కళాకారులను ముందుకు నడిపించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్క కళాకారునికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నది ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. అన్ని జిల్లాల నుంచి ఈ గుర్తింపు కార్డులు తీసుకోవాలని కళాకారులకు వివరించారు. సాంస్కృతిక విభాగం చైర్‌పర్సన్‌గా తనను నియమించడంతో పాటు లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు ఇవ్వడం పట్ల ఆమె ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌ఛార్జి వంకాయల మారుతీప్రసాద్, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు బయ్యవరపు రాధ, నంది అవార్డుల కమిటీ న్యాయ నిర్ణేత కురిటి సత్యంనాయుడు పాల్గొన్నారు.

భువనేశ్వరిని కలిసిన కోరాడ

ప్రజాశక్తి -భీమునిపట్నం : చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు బుధవారం రాజమండ్రిలో కలిశారు. ఆమెకు సంఘీభావం ప్రకటించారు.


ట్రాఫిక్‌కు అంతరాయంపై వివరిస్తున్న పోలీసులు

రోడ్లపై పువ్వులు, పండ్లు అమ్మరాదు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం కూడలిలో రోడ్లపై పువ్వులు, పండ్లు అమ్మరాదని వర్తకులకు సిఐ రామచంద్రరావు స్పష్టంచేశారు. గురువారం సాయంత్రం వేములవలస మార్కెట్ జంక్షన్ వద్ద శాంతి భద్రతల విభాగం సి.ఐ రామచంద్రరావు, ఎస్ఐ నరసింహమూర్తి, ట్రాఫిక్ విభాగం ఎస్ఐ రఘురామ్ మార్కెట్‌లోని పువ్వులు, పండ్ల వర్తకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ వ్యాపారాలు రోడ్డుపైకి రావడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని తెలిపారు. వచ్చి, పోయే వాహనాల వెంట పూలు, పండ్లు పట్టుకొని పరిగెత్తుతున్నారని, దీని వల్ల ప్రాణాలకు కూడా ప్రమాదముందని పేర్కొన్నారు. ఎవరికీ ఇబ్బంది కలగకుండా అమ్మకాలు చేసుకోవాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జికి స్థల పరిశీలన

ప్రజాశక్తి- పిఎం పాలెం : మధురవాడ కూడలి సమీపంలో చంద్రంపాలెం పాఠశాల విద్యార్థులు రోడ్డు దాటేటప్పుడు ప్రమాదాలకు గురికావడాన్ని దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, 6వ వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక కోరిక మేరకు ఎన్‌హెచ్ఎఐ, జివిఎంసి జోన్-2 ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగాల అధికారులు గురువారం ఫుట్ ఓవర్ బ్రిడ్జికి స్థల పరిశీలన చేశారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం కోసం 60 మీటర్ల స్థలం అవసరం ఉండగా ఎన్‌హెచ్ఎఐ వద్ద 45 మీటర్ల స్థలం మాత్రమే ఉంది. మిగిలిన 15 మీటర్ల స్థలం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతులు కోరుతున్నామని ఎన్‌హెచ్ఎఐ అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతుల మేరకు నివేదిక సిద్ధం చేసి కేంద్రానికి పంపిస్తామని చెప్పారు. ఈ ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి రూ.3 కోట్లు ఖర్చు అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎఐ సైట్ ఇంజనీర్ ఖరీమ్, కన్సల్ట్ ఇంజనీర్ వై.శ్రీరామ్, జోన్ టూ వర్క్స్ ఇఇ శాంతిరాజ్, డిఇ వంశీకృష్ణ, టౌన్ ప్లానింగ్ టిపిఒ ఎస్.వరప్రసాద్ పాల్గొన్నారు.

ఆచార్య కృష్ణమంజరి పవార్‌కు ఫార్మసీ టీచర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ విభాగం ఆచార్యులు డాక్టర్ ఎ.కృష్ణమంజరి పవార్‌ను ఫార్మసీ టీచర్ ఆఫ్ ది ఇయర్- 2022 అవార్డు లభించింది. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఫార్మసీ టీచర్స్ ట్రస్ట్ నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఆచార్య పవార్‌ను ఎయు విసి ప్రసాదరెడ్డి గురువారం అభినందించారు.

ఎయులో ఉచిత ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఎయు వైద్యశాలలో ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని విసి ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన వివిధ ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. రెండు రోజులు నిర్వహించే ఈ శిబిరంలో ఉచితంగా విద్యార్థులకు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని విసి తెలిపారు. ఆరోగ్యాన్ని సంరక్షించుకునే విధంగా అందరూ ఆలోచన చేయాలని సూచించారు.

'న్యాయవాదుల రక్షణ నిధి స్టాంపుపై పునరాలోచించాలి'

ప్రజాశక్తి-లీగల్ : న్యాయవాదుల రక్షణ నిధి కోసం ఇటీవల విడుదల చేసిన రూ.20 స్టాంపును ఉపసంహరించుకునేందుకు పునరాలోచించాలని పలువురు న్యాయవాదులు కోరుతున్నారు. ప్రతి పిటిషన్‌పైనా ఈ స్టాంపు అతికించడం అనేది భారతదేశంలోని రాష్ట్ర బార్ కౌన్సిల్‌లలో లేదని, ఇటువంటి ఆలోచనచేసి, న్యాయవాదులకు ఇబ్బందులు కలిగించే విధంగా బార్ కౌన్సిల్ ఏకపక్ష తీర్మానంతో ఈ స్టాంపును విడుదల చేసిందని తెలిపారు. దీన్ని గురువారం నుంచి రాష్ట్ర బార్ కౌన్సిల్ అమల్లోకి తీసుకొచ్చిందని పేర్కొన్నారు. విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలోని నర్సీపట్నం, చోడవరం న్యాయవాద సంఘాలు రెండు రోజులుగా రూ.20 స్టాంపులను వ్యతిరేకిస్తూ విధులను బహిష్కరిస్తున్నాయని తెలిపారు. న్యాయవాదుల మరణానంతరం ఇచ్చే రక్షణ నిధిని పెంచకుండా ఈ స్టాంపును విడుదల చేయడమేంటని న్యాయవాదులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై విశాఖపట్నం న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతపల్లి రాంబాబు, పైలా శ్రీనివాస్‌ను సంప్రదించగా ఈ నెల 9వ తేదీన న్యాయవాదుల సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించి తగు తీర్మానాలు చేస్తామని గురువారం తెలియజేశారు.

ఇదిలా ఉండగా విశాఖపట్నం న్యాయవాదుల సంఘం రెండు లక్షల రూపాయల స్టాంపులను విక్రయించగా గురువారం కొద్ది గంటల్లోనే మొత్తం అమ్ముడైపోయాయి. కొంతమంది న్యాయవాదులకు ఈ స్టాంపులు గురువారం దొరక్క కోర్టుల్లో పిటిషన్లు వేయలేక ఇబ్బందులు పడ్డారు. ఈ విధంగా చూసుకుంటే ఒక్క విశాఖపట్నం నుంచే రోజుకు లక్ష రూపాయల స్టాంపులు వినియోగంలోకి వస్తాయి. రాష్ట్రమంతా విక్రయాలు చూసుకుంటే కొన్ని లక్షల రూపాయలు రోజుకు బార్ కౌన్సిల్‌కు ఆదాయం వస్తుంది. ఈ ఆదాయాన్ని న్యాయవాదుల రక్షణకు ఏ విధంగా ఉపయోగిస్తారో కూడా తీర్మానాలు చేయకుండా స్టాంపును విడుదల చేయడం బార్ కౌన్సిల్ యొక్క నిర్ణయం ఆమోదయోగ్యంగా లేదని న్యాయవాదులు భావిస్తున్నారు.

ఉత్తర నియోజకవర్గ జెసిఎస్ మండల సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి- మాధవధార : మాధవధారలోని మాధవస్వామి కల్యాణ మండపంలో ఉత్తర నియోజకవర్గంలోని జెసిఎస్ మండలం-4కు సంబంధించిన సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ఆధ్వర్యాన జరిగిన సమావేశానికి పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చిక్కాల రామారావు, రాష్ట్ర కార్యదర్శులు చొక్కాకుల వెంకటరావు, రొంగలి జగన్నాథం, జిల్లా ఉపాధ్యక్షులు పీలా ఉమారాణి, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, 50వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి-సీతమ్మధార : ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని నాలుగో పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.గంగాధరరావు సూచించారు. జగ్గారావు బ్రిడ్జి వద్ద స్థానిక ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యాపారం చేసుకునే వారు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగో పట్టణ ట్రాఫిక్ పోలీసులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


ట్రాఫిక్ నిబంధనలను వివరిస్తున్న ఎస్ఐ గంగాధరరావు

కుల గణనకు బీహార్ దిక్సూచి

ప్రజాశక్తి -మాధవధార : కుల గణనలో దేశానికి బీహార్ దిక్సూచి కావాలని ఎపి స్టేట్ కాంగ్రెస్ ఒబిసి విభాగం చైర్మన్ మూల వెంకటరావు పేర్కొన్నారు. దేశ జనాభాలో ఒబిసిల శాతం అత్యధికమన్నది అందరూ ఎప్పటినుంచో అంగీకరిస్తున్న సత్యమని పేర్కొన్నారు. బీహార్ గణాంకాలు ఈ సంగతినే ధ్రువీకరించాయని తెలిపారు. దేశంలో ఆర్థిక సంస్కరణలు అమలు చేసిన పర్యవసానంగా దేశవ్యాప్తంగా కులవృత్తులు తీవ్ర సంక్షోభంలో పడి నిరసనలు వెల్లువెత్తాక అట్టడుగు వర్గాల సంక్షేమానికి ప్రభుత్వాలు కొత్త విధానాలు రూపొందించాయని తెలిపారు. ఒబిసి హక్కుల కోసం మాట్లాడే పార్టీలు కొత్త ఆలోచనలు చేయక తప్పదని పేర్కొన్నారు. ఒబిసిలలో సామాజికంగా, ఆర్థికంగా ఎన్నో వ్యత్యాసాలు ఉన్నాయని గ్రహించాక వాటికి పరిష్కార మార్గాలేంటో తెలియజేయాలని కోరారు. ఒబిసి కులాల్లో కొన్ని మాత్రమే అభివృద్ధి ఫలాలు అందుకుంటున్నాయని తెలిపారు. కుల వ్యవస్థ వల్ల సామాజిక అభివృద్ధికి మెజార్టీ వర్గాలు దూరంగా ఉండిపోయాయని బ్రిటీష్ వలస పాలనలోనే గుర్తించారని, స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడిచాక కూడా అత్యంత వెనుకబడిన కులాలు ఉండటం దౌర్భాగ్యం అని పేర్కొన్నారు.

జింబాబ్వే యువతికి 'దిశ' రక్షణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్ర యూనివర్సిటీలో పీజీ చదువుతున్న జింబాబ్వే విద్యార్థిని పట్ల మరొక విదేశీయుడు అనుచితంగా ప్రవర్తించడంతో రాత్రి వేళ ఆమె దిశ యాప్ ద్వారా రక్షణ పొందింది. ఈ కేసుకు సంబంధించి ఎంవిపి పోలీసుల కథనం ప్రకారం... ఆంధ్ర యూనివర్సిటీలో పీజీ చదువుతున్న జింబాబ్వే విద్యార్థిని మద్దిలపాలెంలోని కృష్ణా కాలేజీ సమీపంలో గది తీసుకొని నివాసముంటోంది. జింబాబ్వేకి చెందిన ఒక యువకుడు బుధవారం అర్ధరాత్రి యువతి గదికి వెళ్లి అసభ్య పదజాలంతో దూషించాడు. భయాందోళనలకు గురైన విద్యార్థిని దిశ యాప్‌కు కాల్ చేసి సహాయం కోరింది. సమాచారం అందుకున్న ఎంవిపి పోలీసులు 5 నిమిషాల వ్యవధిలోనే బాధితురాలి వద్దకు చేరుకున్నారు. బాధిత యువతితో గొడవ పడుతూ అసభ్యంగా ప్రవర్తించిన విదేశీయుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం యువతి అభ్యర్థన మేరకు ఆ యువకునికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు.

ఆధార్‌ం లేక.. దేనికీ నోచుకోక

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించని వైనం
- ప్రూఫ్ ఆఫ్ ఐడెంటటీ లేకపోవడమే కారణమంటున్న సచివాలయ సిబ్బంది
- కల్పించాలని వేడుకుంటున్న బాధితుడు నాగరాజు

ప్రజాశక్తి - యలమంచిలి

ముంతా నాగురాజు... వయస్సు 38 ఏళ్లు. (వయస్సు లెక్క అతని అంచనా మాత్రమే). కాగితాలు ఏరుకొని బతికే నాగరాజును వెనుక నుంచి ఓ లారీ గుద్దేయడంతో ఆయన కాలు విరిగిపోయింది. ప్రమాదానికి కారకుడైన లారీ యజమాని నాగరాజును విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లి కాల్లో స్టీల్ రాడ్ వేయించి యలమంచిలిలో దింపేశాడు. ప్రమాదం తరువాత నాగరాజు బతుకు మరింత దుర్భరమైంది. రూపాయ సంపాదన లేదు. తాగడానికి గంజి కూడా కరువైంది. చిన్న చిన్న హోటళ్ల వద్దకెళ్లితే వారు పోసే టీ కాస్త తాగి పడుకునే వాడు. నొప్పితోనే కాలు కూడదీసుకొని ఆ పక్కనే ఉన్న ఖాళీ బ్రాందీ సీసాలు శుభ్రం చేసి ప్యాకింగ్ చేసే పనిలో కుదిరాడు. రోజుకు రెండొందల రూపాయలు సంపాదించి జీవనం సాగిస్తున్నాడు. యలమంచిలి -గాజువాక మార్గంలో బైపాస్ రోడ్డు వద్ద ఉన్న పెట్రోల్ బంకు, షాపుల వద్దే ఉంటున్నాడు.

నాగరాజు స్వస్థలం విజయవాడ బెంజిసర్కిల్. యుక్తవయస్సులోనే నాగరాజు లారీ క్లీనర్‌గా కుదిరాడు. దేశం పట్టి తిరిగేవాడు. అప్పుడే పెళ్లయింది. ఇద్దరు పిల్లలు పుట్టారు. అయితే 2007లో దువ్వాడ రైలు ప్రమాదంలో భార్య పిల్లలు మరణించారు. దీంతో నాగరాజు ఒంటరివాడయ్యాడు. కాగితాలు, వాటర్‌బాటిళ్లు ఏరుకొని ఇక్కడే (యలమంచిలిలో) ఉండిపోయాడు.

ఏ దిక్కు లేని నాగరాజు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో తనకు సాయం ఏదైనా అందుతుందేమోనని ఆశగా ఎదురు చూశాడు. ట్రై సైకిల్ సాయం అందించినా ప్రయాణం కాస్త సులువౌతుందని వేడుకున్నాడు. ఆధార్ కార్డు తెమ్మన్నారు. లేదని నాగరాజు చెప్పడంతో తామేమీ చేయలేమని సచివాలయ సిబ్బంది వెళ్లిపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే ఇన్సూరెన్స్, హెల్త్ పథకాలే కాదు.., సంక్షేమ పథకాలు కూడా వర్తించవన్నారు.

ఆధార్ కార్డు లేకపోయినా పాన్‌కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు, ఓటరు కార్డు, బ్యాంకు అకౌంటు, వాటర్ బిల్లు, టెలిఫోన్ బిల్లు, ఎలక్ట్రిసిటీ బిల్లు, బర్త్ సర్టిఫకెట్ వీటిలో ఏదైనా ఉండాలి. ఇవేవీ లేని నాగరాజు కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలకు అనర్హుడిగా మిగిలాడు. ప్రూఫ్ ఆఫ్ ఐడెంటటీ, ప్రూఫ్ ఆఫ్ అడ్రస్ కాగితాలు లేనిదే తామేమీ చేయలేమని ప్రభుత్వ సిబ్బంది చెబుతున్నారు. 'నేను ఈ దేశ మనిషిని కాదా?' అని నాగరాజు అడిగే ప్రశ్నకు జవాబు చెప్పేదెవరు? దీనికి ప్రభుత్వం, ఉన్నతాధికారులే పరిష్కారం చూపాలి. జిల్లా ఉన్నతాధికారులు తనకు ప్రూఫ్ ఆఫ్ ఐడెంటటీ కల్పించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని నాగరాజు కోరుతున్నాడు.



బాధితుడు ముంతా నాగరాజు



ఎంఒయు చూపుతున్న దృశ్యం

భౌగోళిక గుర్తింపు అధ్యయనంపై ఎపిఎఫ్‌పిఎస్‌తో లా వర్సిటీ ఎంఒయు

ప్రజాశక్తి-సబ్బవరం

భౌగోళిక గుర్తింపు అధ్యయనంపై సెంటర్ ఫర్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ డిపార్ట్మెంట్ నోడల్ ఏజెన్సీ వారి ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ (ఎపిఎఫ్‌పిఎస్)తో స్థానిక దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ ఎంఒయు కుదుర్చుకున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జోగి నాయుడు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భౌగోళిక గుర్తింపు సూచనల ఫైలింగ్‌కు సంబంధించి సహకారం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉత్పత్తి చేయబడిన వివిధ ఆహార ఉత్పత్తుల కోసం భౌగోళిక గుర్తింపు ట్యాగ్‌ల దాఖలును ప్రోత్సహించడానికి, మద్దతు ఇవ్వడానికి, సంబంధించిన నైపుణ్యం, వనరులను మార్పిడి చేసుకోవడానికి సహకారం కోసం విధి, విధానాలు రూపొందించడం కోసం, సెమినార్లు, ఎగ్జిబిషన్లు, సింపోజియంలు, వర్క్‌షాప్‌లు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం కోసం ఈ ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జోగి నాయుడు, ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ అధికారులు చిరంజీవి చౌదరి, సమక్షంలో ఎంఒయు పత్రాలను మార్చుకున్నట్లు వెల్లడించారు.

'నందమూరి, నారా కుటుంబాలకు అవినీతి మచ్చ లేదు'

ప్రజాశక్తి-అనకాపల్లి : దాదాపు 20 సంవత్సరాల పాటు అధికారంలో ఉన్నప్పటికీ నందమూరి, నారా కుటుంబాల వారు ప్రభుత్వంలో జోక్యం చేసుకున్నట్లుగాని, అవినీతికి పాల్పడినట్లు ఇంతవరకు ఎవరు ఆరోపించలేదని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు అన్నారు. నారా భువనేశ్వరిని కలిసిన తరువాత గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మొదటిసారిగా పగ ప్రతీకారంతో రగిలిపోతున్న జగన్ రెడ్డి ఏకంగా చంద్రబాబు, లోకేష్‌ను జైలుకు పంపి ఎన్నికలలో ఏకపక్షంగా ఎన్నికల నిర్వహణకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. న్యాయవ్యవస్థ ఈ కేసు లోతుల్లోకి వెళితే వాస్తవాలు తెలుస్తాయన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు నీలబాబు, జగన్మోహన్, మారిశెట్టి శంకర్రావు, కర్రీ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



ముత్యాల సతీష్‌ను సత్కరిస్తున్న జైభీమ్ యూత్ సభ్యులు


అన్న సమారాధన

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవీఎంసీ 83వ వార్డు పరిధి భీమునిగుమ్మం జై భీమ్ యుత్ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు తనయుడు ముత్యాల సతీష్ ప్రారంభించారు. జై భీమ్ యూత్‌ని ఈ సందర్భంగా సతీష్ అభినందించారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని, అందుకు తమ వంతు ఆర్థిక సహాయం చేయటానికి తామెప్పుడూ ముందుంటామని తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులు ముత్యాల సతీష్‌ను దుస్సాలువాతో సన్మానించి చిరు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ యూత్ సభ్యులు, సంజు టీం సభ్యులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన పైలా ప్రసాదరావు

ప్రజాశక్తి - కె.కోటపాడు

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను టిడిపి మాడుగుల నియోజకవర్గం నాయకులు పైలా ప్రసాదరావు, రాష్ట్ర కార్యదర్శులు బండారు అప్పలనాయుడు, కోట్ని బాలాజీ ఢిల్లీలో కలిసి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం మోపిన అక్రమ కేసుల నుంచి త్వరలోనే నారా చంద్రబాబు నాయుడు బయటకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. బండారు సత్యనారాయణ మూర్తి అరెస్టు సందర్భంగా ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితులు, పోలీసులు వ్యవహరించిన తీరు వంటి విషయాలను లోకేష్‌కు వివరించారు. వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, చంద్రబాబుకు మద్దతుగా సాగుతున్న ఉద్యమం గురించి చర్చించారు.



ఢిల్లీలో లోకేష్‌ను కలిసిన పైలా ప్రసాదరావు, అప్పలనాయుడు

ప్రజలకు మంచి చేసేందుకే రాజకీయాల్లోకి

ఉషోదయ విద్యా సంస్థల చైర్మన్ రమణాజీ

ప్రజాశక్తి-చోడవరం

ప్రజలకు మంచి చేయాలన్న సంకల్పంతోనే రాజకీయల్లోకి వచ్చినట్లు ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జెర్రిపోతుల రమణాజీ అన్నారు. ఇటీవల జనసేన పార్టీలో చేరిన ఆయన గురువారం చోడవరంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కశింకోట మండలం ఎఎస్.పేట గ్రామానికి చెందిన తనుకు స్కూల్ స్థాయి నుండి నాయకత్వ లక్షణాలు అలవడ్డాయని చెప్పారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘంలో పనిచేశానని, యూనివర్సిటీ విద్యార్థి విభాగంలో పలు బాధ్యతలు నిర్వహించానని చెప్పారు. విద్యాభివృద్ధితో ఎదిగి చోడవరంలో 20 ఏళ్ల క్రితం విద్యాసంస్థల ఏర్పాటు చేసి ఎలమంచిలి, అచ్యుతాపురం, మాడుగుల, దేవరపల్లి తదితర ప్రాంతాలలో స్కూళ్లు, కాలేజీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఏపీ ప్రైవేటీ కాలేజీల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నానన్నారు. ఒకప్పుడు జిల్లాలో నాలుగు సుగర్ ఫ్యాక్టరీలు క్రషింగ్ నిర్వహించగా, వాటిలో నేడు మూడు మూతపడ్డాయని, దీంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతిందని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు, సుజల స్రవంతి ప్రాజెక్టులు పూర్తయితే తప్ప జిల్లాలో మెట్ట ప్రాంత మండలాలకు నీటి వసతి రాదన్నారు. గ్రామీణ ప్రాంతానికి మరిన్ని పరిశ్రమలు రావాల్సి ఉందని, వీటిని సాధించుకోవడానికి రాజకీయ మార్పు అవసరమని, జనసేన పవన్ కళ్యాణ్ నాయకత్వంలోనే అది సాధ్యమవుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో పార్టీ బాధ్యతలు అప్పగిస్తే చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రమణాజీ

డెఫ్ క్రికెట్ విజేత శామ్యూల్‌కు అభినందనలు



శామ్యూల్‌ను అభినందిస్తున్న గేదెల సత్యనారాయణ తదితరులు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

ఒడిశా రాష్ట్రంలో జరిగిన జాతీయ డెఫ్ క్రికెట్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఏపీ రాష్ట్ర డెఫ్ క్రికెట్ జట్టు తరుపున ఆడి విశేష ప్రతిభ కనబరిచి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన బుచ్చయ్యపేట మండలం ఆర్.శివరాంపురం గ్రామానికి చెందిన మొల్లి శామ్యూల్‌ను పలువురు అభినందించారు. ఈ మేరకు విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, రోలుగుంట ఎస్ఐ నాగ కార్తీక్, గ్రామ పెద్దలు బుధవారం రాత్రి శామ్యూల్‌కు పూల మాలలు వేసి సాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గేదెల సత్యన్నారాయణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులను గుర్తించి జాతీయ స్థాయిలో పతకాలు సాధించడమే లక్ష్యంగా పేద క్రీడాకారులకు విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద కుమార్ తగిన ఆర్థిక సాయం అందించి ప్రోత్సాహిస్తున్నారని తెలిపారు. డెఫ్ క్రికెట్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్న మొల్లి శామ్యూల్‌కి విశాఖ డెయిరీ అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లేగ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని నరిశింగబిల్లి గ్రామంలో పశు గణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన లేగ దూడల అందాల పోటీల(ప్రదర్శన)ను ఎంపిపి కలగా లక్ష్మీ గున్నయ్యనాయుడు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ అమూల్ పాలు సేకరణ చేసిన వారికి రుణాలు అందించడం జరుగుతుందన్నారు. డిఎల్‌డిఎ డాక్టర్ బి.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ లేగ దూడల పెంపకంతో రైతులు ఆర్థిక పరిపుష్టి సాధిస్తారన్నారు. అనంతరం ఆరోగ్యంగా దృఢంగా ఉన్న దూడలను గుర్తించి విజేతలను ఎంపిక చేశారు. ప్రథమ బహుమతి రావిప్రసాద్ ముర్రా దూడకు, ద్వితీయ బహుమతి ఎన్జీ.పాలెం గ్రామానికి చెందిన దండిన రాము దూడకు, తృతీయ బహుమతిని సత్తిబాబు లభించాయి. కార్యక్రమంలో దూడలను తీసుకొచ్చిన ప్రతి ఒక్క యజమానికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కోన అరుణ నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోమునాయుడు, పాల సంఘం మాజీ అధ్యక్షులు కోన సత్యనారాయణ, పశు వైద్యాధికారులు డాక్టర్ అల్ఫోన్సా జార్జ్, డాక్టర్ సుమతిరాణి, డాక్టర్ చైతన్యమణి, పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



లేగదూడల ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపిపి లక్ష్మి తదితరులు



విరాళం అందజేస్తున్న పీలా, గొంతిని శ్రీనివాసరావు

దుర్గాదేవి ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని ఏనుగుతుని పంచాయతీ, చిన్న ఏనుగుతుని గ్రామంలో దుర్గా దేవి ఆలయం నిర్మాణం కోసం తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిని శ్రీనివాసరావు లక్ష 50 వేల రూపాయల విరాళాన్ని గురువారం ఆలయ కమిటీకి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ చేతులు మీదుగా అందజేశారు. విరాళం ఇచ్చిన గొంతిని శ్రీనివాసరావును ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ముందుగా మరిడిమాంబను దర్శించుకొని పూజా కార్యక్రమాలు జరిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాయల మురళి, ఉగ్గిన రమణ మూర్తి, వేగి గోపికృష్ణ, జంపపాలెం సర్పంచ్ సిలపర శెట్టి నాయుడు, గొంతిన చిరంజీవి, ఆడారి రమణ బాబు, నైనంశెట్టి రమణారావు, ఉప్పునూరి అప్పల నాయుడు, గొంతిన నూకరాజు, ఎంపీటీసీ షేక్ దర్గా, మజ్జి నిరంజన్ కుమార్, కర్రి దుర్గి నాయుడు, ఉల్లింగల రమేష్, పచ్చికూర రాము పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో ఎస్‌పి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - బుచ్చెయ్యపేట : శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని అనకాపల్లి ఎస్పీ కెవి.మురళీకృష్ణ అన్నారు. గురువారం సాయంత్రం బుచ్చెయ్యపేట పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాత కేసులను సమీక్షించారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో బీట్ ఏరియాలలో పాయింట్ బుక్స్‌ను ఏర్పాటు చేసి అప్రమత్తంగా ఉండాలని, రౌడీ షీటర్‌లు, బాడ్ క్యారెక్టర్స్ గల వ్యక్తిగతంగా దృష్టిసారించాలని సూచించారు. గుల్లాట, పేకాట, మద్యం రవాణా, గంజాయి తదితర అసాంఘిక చర్యలపై ప్రత్యేక దృష్టి సారించి కేసులు నమోదు చేయాలన్నారు. ఆకస్మికంగా వాహనాలను తనిఖీలు చేసి అసాంఘిక చర్యలను అరికట్టాలన్నారు. ఆయన వెంట సిఐ కుమారస్వామి ఉన్నారు.

రాంబాబుకు ఘన సత్కారం

ప్రజాశక్తి-దేవరాపల్లి : అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలోని నాగయ్యపేటలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొటాన రాంబాబును గ్రామస్తులు గురువారం ఘనంగా సత్కరించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఇఒ బి.పడాల్ దాస్ మాట్లాడుతూ రాంబాబు మాస్టార్ ఎన్నో వృత్తి ప్రవృత్తిలో అంకిత భావంతో పనిచేసి ఉపాధ్యాయ వృత్తికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తేవడం గ్రామానికి మండలానికి గర్వకారణమన్నారు. రాంబాబును ఆదర్శంగా తీసుకొని సేవా దృక్పథం అలవర్చుకోవాలన్నారు. ఆదిరెడ్డి ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కర్రి పుష్ప, ఎంపిటీసీ వంటాకు పైడితల్లమ్మ, బత్తి వెంకటరావు, దాసరి గోవింద, గుల్లిపల్లి సింహాద్రప్పుడు, నరేంద్ర కోమినేని సన్యాసినాయుడు, శంభునాయుడు, కర్రి నాయుడు, సిరికి సింహాచలం నాయుడు, కొరుప్రోలు శ్రీను పాల్గొన్నారు.

విజన్ బిల్డింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి- కశింకోట : మండల మహిళ సమాఖ్య కార్యాలయంలో విజన్ బిల్డింగ్‌పై రెండో దఫా శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా డిఆర్‌డిఏ ఏరియా కోఆర్డినేటర్ దర్మారావు మాట్లాడుతూ ఆర్థిక స్వావలంబన సాధించుకోవాలన్నారు. ఏపిఎం ఎమ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళ సమాఖ్య అధ్యక్షురాలు వి లక్ష్మీ, సెక్రటరీ వి నాగలక్ష్మి, ట్రెజరర్ జి పార్వతి, ఏపిఎం ఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి-చోడవరం వెళ్లే రోడ్‌లో చిన్న బాబు కాలనీ ప్రధాన రహదారిపై ముడుకు లోతు పడిన పెద్ద గుంతను తక్షణమే పూడ్చాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపు రాజు డిమాండ్ చేశారు. దర్జీ నగర్ కాలనీ మామిడిపాలెం చోడవరం చేరుకునే వరకు ప్రధాన రహదారులు పెద్ద పెద్ద గుంతలతో వర్షపు నీరుతో మునిగి ఉండడంతో రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. అయినా అధికారులు, ప్రజా ప్రతినిధులు చోద్యం చూస్తున్నారు తప్ప చర్యలు తీసుకోలేదని విమర్శించారు. తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, లేనిపక్షంలో రోడ్డుపైనే వంటావార్పు చేస్తామని హెచ్చరించారు.

ఆధార్‌తో నగదు బదిలీలో డబ్బుల గల్లంతు

లబోదిబోమంటూ బ్యాంకులకు పరుగులు తీస్తున్న ఖాతాదారులు

ప్రజాశక్తి -బుచ్చెయ్యపేట

సులభతరం లావాదేవీలలో భాగంగా వాణిజ్య బ్యాంకుల్లో నగదు లావాదేవీలకు సంబంధించి తీసుకొచ్చిన ఏఈపిఎస్ (ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టం) వల్ల ఖాతాదారుల నగదుకు రక్షణ లేకుండా పోయింది. పలు బ్యాంకులు తమ శాఖల పరిధిలోని గ్రామాల్లో సిబ్బందిని నియామకం చేసుకొని, చెల్లింపులు, జమలు చేస్తున్నాయి. పలు రకాల యాప్ ద్వారా నగదు లావాదేవీలు జరుగుతున్నాయి. అయితే కొద్దిరోజులుగా ఈ ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టం ద్వారా ఖాతాదారులు ఖాతాలోనించి నగదు మాయమవుతుంది. రెండు రోజులుగా మండలంలోని దిబ్బిడి గ్రామానికి చెందిన ముగ్గురు ఇండియన్ ఓవర్ సీస్ బ్యాంక్ ఖాతాదారులకు సంబంధించి ఒక్కొక్కరి ఖాతా నుండి రూ.10వేలు చొప్పున నగదు మాయమైంది. వడ్డాదికి చెందిన ఒక ప్రజా ప్రతినిధి రెండు ఖాతాల నుండి రూ.10వేలు ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టం ద్వారా లావాదేవీలు నిర్వహించినట్లు మెసేజ్ రావడంతో వెంటనే వారు బ్యాంకులకు సంప్రదించి విచారణ చేశారు. గత కొద్దిరోజులుగా పదుల సంఖ్యలో ఖాతాదారుల నుండి నగదు మాయమవుతుండడంతో లబోదిబోమంటున్న ఖాతాదారులు బ్యాంకులకు పరుగులు తీస్తున్నారు. దీంతో అధికారులు తల పట్టుకుంటున్నారు.

కొనసాగిన టిడిపి నిరసనలు



చోడవరం నిరాహార దీక్షలో మాట్లాడుతున్న నాగజగదీష్

ప్రజాశక్తి-చోడవరం

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా చోడవరంలో టిడిపి చేపట్టిన నిరసన దీక్షలు కొనసాగాయి. గురువారం మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, టిడిపి జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగ జగదీష్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు, పరిశీలకులు మూర్తి యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనకాపల్లి : పట్టణంలోని 82వ వార్డు, నరసింగరావు పేట, చవితినిధి ప్రాంతాల్లో టిడిపి అర్బన్ జిల్లా కార్యదర్శి పోలారపు త్రినాధ్, నాయకులు ఆళ్ళ రామచంద్రరావు, ఆకుల నానాజీ ఆధ్వర్యంలో చేపట్టిన బాబుతో నేను కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబుపై వైసిపి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసుల గురించి ప్రజలకు వివరించారు.

ఎస్.రాయవరం : చంద్రబాబు విడుదలయ్యే వరకు పోరాటం ఆగదని టిడిపి నియోజకవర్గ పరిశీలకుడు యనమల కృష్ణ అన్నారు. గురువారం సాయంత్రం గుడివాడ గ్రామంలో బాబుతో మేము సైతం కార్యక్రమంలో భాగంగా కాగడా ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏ విధమైన ఆధారాలు లేని కేసులో కుట్రపూరితంగా ఇరికించి జైలులో పెట్టడం దుర్మార్గమైన పాలనకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పొలిట్ బ్యూరో సభ్యురాలు అనిత, టిడిపి మండలశాఖ అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, పెదిరెడ్డి శ్రీను, గుర్రం రామకృష్ణ, నల్లపరాజు వెంకటరాజు, ఆకేటి శాంతి, కోన అప్పలరాజు, మాజీ ఎంపిటీసీ బుజ్జి, అల్లు నరసింహమూర్తి, గింజల లక్ష్మణరావు, అల్లు మోహన్ పాల్గొన్నారు.

భీమునిపట్నం : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ భీమిలి పార్టీ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్షలు గురువారం నాటికి 26వ రోజుకు చేరాయి. పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షులు కురిమిన లీలావతి, నియోజక వర్గ అధ్యక్షులు బోయి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 38వ వార్డు పరిధి ఆర్‌సిఎం పాఠశాల రీడింగ్ రూమ్ వద్ద టిడిపి నాయకులు, కార్యకర్తలు అర్ధనగ్నంగా మోకాళ్లపై కూర్చొని సామూహిక రిలే నిరాహారదీక్ష చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జి వారినుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు గోడి నరసింహాచారి, క్లస్టర్ ఇన్‌ఛార్జి కేదారి లక్ష్మి, వార్డు కార్పొరేటర్ గోడి విజయలక్ష్మి, నాయకులు మజ్జి త్రినాద్, వెంకట అప్పారావు పాల్గొన్నారు.

రోజా వేషాలు కట్టిపెట్టాలి

రాష్ట్ర మంత్రిగా ఉన్న రోజా వేషాలు కట్టిపెట్టాలని టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి విమర్శించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా బూతులకు తెరలేపింది రోజా కాదా ? అని ప్రశ్నించారు. నారా భువనేశ్వరిపై కొడాలి నాని నోరు పారేసుకున్నపుడు రోజా ఏమైందని ప్రశ్నించారు.

నల్ల బ్యాడ్జీలతో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన



నినాదాలు చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ప్రజాశక్తి-దేవరాపల్లి

సమగ్ర శిక్ష కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఉద్యోగుల సమస్యలను పరిష్కారం చేయాలని మండలానికి చెందిన ఉద్యోగులు గురువారం నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలల పెండింగ్ జీతాలు విడుదల చేయాలని, 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, రిటైర్మెంట్ వయసు 62కి పెంచాలని, హెల్త్ కార్డ్స్ ఇవ్వాలని, ఈఎస్ఐ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.20 లక్షలు ఇవ్వాలని, మరణించిన ఉద్యోగుల కుటుంబానికి కారుణ్య నియామకం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అకౌంటెంట్ శ్రీను, మెసెంజర్ ఉపేంద్ర, డిటిఈఓ రమేష్, స్వాతి ప్రియ, మహేష్, ఎంఆర్‌సి స్టాఫ్, సిఆర్‌ఎం టిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: నియోజకవర్గంలో పని చేస్తున్న సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు శాసనసభ్యులు పెట్ల ఉమా శంకర్ గణేష్‌న కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమస్యలను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యే దిశగా చూస్తానని హామీ ఇచ్చారు. మూడు నెలల జీతాల బకాయిలు విడుదల అయ్యే విధంగా చూస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మండలం సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగుల అధ్యక్షుడు ఏ.వరహాల నాయుడు, జనరల్ సెక్రెటరీ ఎన్.రమేష్, పి వెంకట్రావు, నాయుడు, సాహెబ్, శ్రీనువాసురావు, పి.సతీష్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ సూచించారు. వైసిపి వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన డాక్టర్ బొడ్డేడ లక్ష్మీ నరసింహారావు గురువారం మంత్రి స్వగృహంలో అమర్నాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు ప్రజలలోకి తీసుకువెళ్లాలన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలు తూచా తప్పకుండా పాటిస్తానని, వైసిపి గెలుపు కోసం కృషి చేస్తానని, తనకు రాజకీయ భిక్ష పెట్టిన అమర్నాథ్‌కి, వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్‌కి జీవితాంతం రుణ పడి ఉంటానని ఈ సందర్భంగా లక్ష్మీనరసింహారావు తెలిపారు. సత్యనారాయణ దేవాలయం చైర్మన్ కెయం నాయుడు, భోగ లింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు, రఫీ హుస్సేన్, దుంగ నూకేష్ పాల్గొన్నారు.

బండారుకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - పరవాడ : రాష్ట్ర మంత్రి రోజాపై చేసిన వ్యాఖ్యల కేసులో బెయిల్ మంజూరు అనంతరం బుధవారం రాత్రి తన స్వగ్రామానికి వచ్చిన టిడిపి నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తికి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ముందుగా పరవాడలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తదనంతరం ర్యాలీగా తన స్వగ్రామమైన వెన్నెలపాలెం చేరుకున్నారు. సైకో సిఎమ్ పోవాలి, సైకిల్ రావాలి అంటూ నినాదాలు చేశారు.

విశ్రాంత హోంగార్డుకు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి- సబ్బవరం : సబ్బవరం పోలీసు స్టేషన్‌లో ట్రాఫిక్ హోంగార్డుగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన కె.కోటేశ్వరరావుకు ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు ఒక రోజు వేతనం మొత్తం రూ.3,86,950 చెక్కును జిల్లా ఎస్‌పి కెవి.మురళీకృష్ణ చేతుల మీదుగా ఎస్‌పి కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కోటేశ్వరరావు ట్రాఫిక్ విధులు నిర్వహించి ప్రజల ప్రశంసలు పొంది, పోలీసు శాఖకు మెరుగైన సేవలు అందించారన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో పనిచేస్తున్న హోంగార్డు ఎవరైనా విధి నిర్వహణలో మరణించిన, ఉద్యోగ విరమణ పొందిన వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు హోంగార్డులందరూ స్వచ్ఛందంగా ఒక రోజు వేతనం ఇవ్వడం అభినందనీయమన్నారు. అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయ భాస్కర్, పోలీసు కార్యాలయ పరిపాలనధికారి బి.శారద, సీనియర్ అసిస్టెంట్ డి.భవాని పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్ పటిష్టతకు కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఏపియుడబ్ల్యుజె అనకాపల్లి ప్రెస్ క్లబ్ పటిష్టతకు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా కలిసికట్టుగా కృషి చేయాలని ఆ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక జార్జ్ క్లబ్ ఆవరణలో గురువారం అనకాపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కోయిలాడ చంద్ర శేఖర్ అధ్యక్షతన ఎలక్ట్రానిక్ మీడియా సమావేశం జరిగింది. సమావేశంలో అనకాపల్లి ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ప్రధాన కార్యదర్శి ఆళ్ల వెంకట అప్పారావు ప్రకటించారు. అధ్యక్షులుగా శిలపరశెట్టి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా బొట్ట శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా భీమరశెట్టి నూకేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎం శ్రీనివాసరావు, కోశాధికారి కే.గంగరాజు, కార్యవర్గ సభ్యులుగా పీలా శ్రీనివాసరావు, డి.బుజ్జి, ఎన్ కిషోర్‌ను ప్రకటించారు. సమావేశంలో పెంటకోట జోగినాయుడు, ఏ.జగదీష్, వెంకట అప్పారావు పాల్గొన్నారు.

దుర్గమాంబను దర్శించుకున్న ఎంపీ

ప్రజాశక్తి -కశింకోట : కశింకోటలోని శ్రీదుర్గమాంబ అమ్మవారి పండుగ ఆలయ కమిటీ చైర్మన్, వైసిపి జిల్లా పార్టీ అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి విష్ణు మూర్తి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బార్ కౌన్సిల్ సభ్యుల నిరసన

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:ఈ నెల 5వ తేదీ నుంచి కోర్టులో దాఖలు చేసే ఇతర పీటీషన్లపై న్యాయవాదుల సంక్షేమ నిధి నుండి రూ.20 స్టాంప్ అతికించే విధానం వ్యతిరేకిస్తూ స్థానిక కోర్టు వద్ద బార్ కౌన్సిల్ సభ్యులు బార్ కౌన్సిల్ సభ్యులు గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రావడ సత్య నారాయణ మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధానం ఆంధ్ర రాష్ట్రంలో అమలు చేయడం సరి కాదన్నారు. ప్రతీ రోజు కోర్టులో కక్షిదారుల తరుపున క్రిమినల్, సివిల్ దావాల్లో వందల సంఖ్యలో పీటీషన్లు దాఖలు చేయాల్సి ఉంటుందని, ఇలాంటి విధానంతో కక్షిదారులపై భారం మోపాల్సి వస్తుందని తెలిపారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తీసుకున్న నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి లోకా లోవరాజు, సీనియర్ న్యాయవాదులు గొలుసు శంకర్‌రావు, పొక్కునూరి నాగేశ్వరరావు, అనిమి రెడ్డి గోవింద్ పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న బార్ కౌన్సిల్ సభ్యులు



బుక్‌లెట్ ఇస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

సంక్షేమ పథకాలపై ఎమ్మెల్యే ఆరా

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో గురువారం రెండవ రోజు గడపగడపకు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బాబురావు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గడపగడపకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరే విధంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రత్నం, సర్పంచ్ జయ రత్నకుమారి, వైస్ ఎంపీపీ నానాజీ, వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, పార్టీ నాయకులు శేషారత్నం, సూరకాసుల గోవింద్, లోడగల చంద్రరావు, బాబురావు పాల్గొన్నారు.



సత్కరిస్తున్న సర్పంచ్ సూర్యకుమారి

వార్డు మెంబర్‌కు సత్కారం

ప్రజాశక్తి -రావికమతం:మండలంలో కవగుంట గ్రామ పంచాయతీలో ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన కంఠముఖి జానకిని సర్పంచ్ దాసరి సూర్యకుమారి, కార్యదర్శి స్వామి పలువురు వార్డు సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గత పంచాయితీ ఎన్నికల్లో వైయస్సార్సీపి తరఫున రెండవ వార్డ్ మెంబర్‌గా ఎన్నికైన కంఠముఖి శ్రీనివాసరావు అనారోగ్య కారణంతో మృతి ఆ స్థానానికి ఆగస్టులో ఉప ఎన్నికలు జరిగాయి. ఈ స్థానానికి వైసిపి తరఫున కంటముఖి శ్రీనివాసరావు భార్య కంటుముఖి జానకి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు చంద్రన్న రామనాయుడు, రొబ్బా కుమారి, బీరా పద్మ, కోపరేటివ్ డైరెక్టర్ వెచ్చం చిన నాగరాజు, స్కూల్ కమిటీ చైర్మన్ నాయుడు బాబు పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బందిపై ఆర్‌డిఒ అసహనం

ప్రజాశక్తి-కోటవురట్ల:జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించి దాదాపు నెల రోజుల కావస్తున్నా నేటికీ కొన్ని సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యం వహించడంతో రెవెన్యూ సిబ్బందిపై ఆర్‌డిఒ వెంకట జయరాం అసహనం వ్యక్తం చేశారు. గురువారం ఆయన తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. స్పందన ఫిర్యాదుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కారం కానీ సమస్యల పట్ల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా పలు గ్రామాల్లో సమగ్ర భూసర్వేపై వచ్చిన ఫిర్యాదులపై సైతం నిర్లక్ష్యం వహించడంతో పాటు వివిధ సమస్యలు కూడా పరిష్కారం కాకపోవడం, మండల కేంద్రంలో భూ సర్వే నత్త నడకన సాగుతుండటం పట్ల సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. త్వరితగతిన స్పందన ఫిర్యాదులు పరిష్కరించాలని భూ సర్వే సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సోమశేఖర్, ఆఐ వుర్ధవరావు, సర్వేయర్ శ్రీనివాసు పాల్గొన్నారు.



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఆర్‌డిఒ

మాజీ ఎమ్మెల్యేకు ఘన నివాళి

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:పాయకరావుపేట నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కాకర్ల నూకరాజు ఇటీవల మృతి చెందడంతో కుటుంబ సభ్యులను టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు, నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత పరామర్శించారు. మండలంలో చిన్న గుమ్ములూరు గ్రామంలో గురువారం నూకరాజు కుటుంబీకులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అమలాకంటి అబద్దం, కందుల వెంకటేశ్వరావు, పల్లెల జగ్గారావు, అల్లు నరసింహమూర్తి, కొప్పిశెట్టి వెంకటేష్ పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న అనిత, నాయకులు



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

తాగునీటి ట్యాంకు పనులు ప్రారంభం

ప్రజాశక్తి -రావికమతం:మండలంలో తట్టబంద పంచాయతీ పొర్లుపాలెం గ్రామంలో తాగునీటి ట్యాంక్ నిర్మాణ పనులకు గురువారం గ్రామ సర్పంచ్ గోకివాడ రమణ శంకుస్థాపన చేశారు. గ్రామంలో గత కొంతకాలంగా మంచినీటి కోసం ఇక్కట్లు పడుతున్న విషయం తెలిసిందే. రూ. 7లక్షల 50 వేల నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు గొల్లవిల్లి సురేష్, శీను పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ పండగ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో గురువారం మరిడిమాంబ అమ్మవారి పండుగను భక్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా వేంళతాళాలతో డప్పులతో సందడిగా ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ లగుడు ధనాజీ, మాజీ జెడ్పిటిసి చిటికెల తారక వేణుగోపాల్. గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



బారులు తీరిన భక్తులు

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్థానిక ఏరియా ఆసుపత్రిలో సమస్యలను ఎమ్మెల్యే గణేష్ పరిష్కరించాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గం ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర డిమాండ్ చేశారు. గురువారం నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్ ఆధ్వర్యంలో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రి ప్రాంగణంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, చిన్న పిల్లల ఐసియు వార్డుల్లో కిట్లు లేవన్నారు. డెలివరీ రూమ్‌ల్లో కరెంట్ కోతలతో టార్చ్ లైట్ల వెలుగులో డెలివరీలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఆసుపత్రిలో లిఫ్ట్ మరమ్మత్తుకు గురై నాలుగేళ్లు కావస్తున్నా పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు, సీనియర్ నాయకులు రేగుబళ్ల శివ, ఎస్సీ సెల్ అధ్యక్షులు బోయిన చిరంజీవి, వాసం వెంకటేష్ పాల్గొన్నారు.



లోగో ఆవిష్కరిస్తున్న గంటా శ్రీనివాసరావు

'ముసలమ్మ' ట్రస్టు లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:ముసలమ్మ చారిటబుల్ ట్రస్టు లోగోను మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు చారిటబుల్ ట్రస్టుల ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. తన మాతృమూర్తి సంస్మరణార్థం ట్రస్టు ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటున్న యజ్జల బంగారు చిట్టిని ఈ సందర్భంగా గంటా అభినందించారు. ఈ కార్యక్రమంలో ముసలమ్మ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు యజ్జల బంగారు చిట్టి, నన్నయ యూనివర్శిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ముత్యాలనాయుడు, లక్ష్మీ గాయత్రి హాస్పిటల్ అధినేత డాక్టర్ రామ్ కుమార్, ఉత్తరాంధ్ర ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శి జార్జి ఫెర్నాండేజ్ పాల్గొన్నారు.

రైతులు ఇకెవైసి నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ పంట నమోదు చేయించుకున్న రైతులు ఈనెల 6వ తేదీ నాటికి ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ తెలిపారు. రైతుల సౌలభ్యం కోసం మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో సిబ్బంది రైతులకు ఈకేవైసీ నమోదు చేస్తున్నారని తెలిపారు. వ్యవసాయ శాఖ పథకాలు సున్నా వడ్డీ, పంట రుణాలు వైఎస్సార్ ఉచిత పంటల భీమా, రైతు భరోసా పండించిన పంటని ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నా, ఇన్ పుట్ సబ్సిడీ అందాలన్నా తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని సూచించారు.

జర్నలిస్ట్ కాలనీ రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:మున్సిపాలిటీ 14వ వార్డు జోగినాధునిపాలెం జర్నలిస్ట్ కాలనీ సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జర్నలిస్టు కాలనీకి రోడ్డు సౌకర్యం కల్పించాలని పాత్రికేయుల కోరిక మేరకు ఎంపీ డాక్టర్ సత్యవతి దృష్టికి తీసుకెళ్లడంతో రూ. 10 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. ఇళ్ల స్థలాలు రాని జర్నలిస్టులకు స్థానిక ఆర్డిఓతో చర్చించి మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, పట్టణ వైసిపి అధ్యక్షులు ఏకా శివ, సచివాలయాల కన్వీనర్ల కోఆర్డినేటర్ తమరాన శ్రీనివాస్, జర్నలిస్టు యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఉపాధ్యాయుని చొరవతో.. విభిన్న ప్రతిభావంతులకు బోధనా సామగ్రి వితరణ

ప్రజాశక్తి- రావికమతం:మండలంలోని మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు చొరవతో విభిన్న ప్రతిభా వంతులకు బోధనా సామగ్రిని గురువారం అందజేశారు. రోటరీ క్లబ్ విశాఖ సెంటీనియల్ సభ్యులు దివ్యాంగులకు బోధనోపకరణ సామగ్రితో పాటు 8వ తరగతి, 5వ తరగతి, పదో తరగతి విద్యార్థులకు రూ.20వేల విలువైన స్టడీ మెటీరియల్‌ను మండల విద్యాశాఖ అధికారులు సి.హెచ్ తలుపులు, ఎన్.బ్రహ్మాజీ, ప్రధానోపాధ్యాయులు వంకాయల రామారావులు అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి సి.హెచ్ తలుపులు మాట్లాడుతూ, ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడు చొరవ తీసుకొని రోటరీ క్లబ్ ఆఫ్ సెంటినియల్ ప్రెసిడెంట్ కె.వి.వి.ఎస్ మూర్తితో మాట్లాడి పిల్లలకు స్టడీ మెటీరియల్‌తో పాటు బోధనోపకరణ సామాగ్రిని అందించడం జరిగిందన్నారు. గతంలో ప్రత్యేక ఉపాధ్యాయుడు విజ్ఞప్తి మేరకు ప్రత్యేక అవసరాల పిల్లలకు టీ షర్టులు, విద్యా సామగ్రి అందజేశారని కొనియాడారు. అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖ సెంటినియల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, సిఆర్పి రామారావు, పాఠశాల సిబ్బంది నాగేశ్వరరావు, బాలరాజు, ఎర్రయ్య, రమణాజీ, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న మండల విద్యాశాఖాధికారులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

వైసిపి పాలనలో ప్రతి ఇంటికీ లబ్ధి

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించారు. నియోజకవర్గంలో గొలుగొండ మండలానికి సంభందించిన వైసిపి నాయకులు, వాలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు పాల్గొన్నారు. మండల పార్టీ అధ్యక్షులు లెక్క సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు ఉమా శంకర గణేష్ మాట్లాడుతూ, జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరుతుందన్నారు.2024 ఎన్నికలలో గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, జెడ్పీటీసీ సుర్ల వెంకట గిరిబాబు, ఎంపిపీ మణికుమారి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు లోచల సుజాత, యూత్ ప్రెసిడెంట్ రామకృష్ణం నాయుడు, రైతు సంఘం నాయకులు పోలిరెడ్డి రాజుబాబు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు సర్టిఫికెట్ల అందజేత

ప్రజాశక్తి-గొలుగొండ :ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన ప్రత్యేక బాలల క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన గొలుగొండ మండలం జోగుంపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పాఠశాల ప్రధానో పాధ్యాయులు సరోజిని గురువారం సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఉపాధ్యాయులు అప్పారావు మాస్టర్ మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన ప్రతిభతో పాఠశాలకు పేరు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పిడి భూపతి లోవరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : నరవ నీటి శుద్ధి కేంద్రం వద్ద ఎపిఇపిడిసిఎల్ సంస్థ విద్యుత్ కేబుల్ మెయింటెనెన్స్ పనులు చేస్తున్నందున ఈ నెల6న శుక్రవారం విద్యుత్ నిలిపివేస్తున్నందున నగరంలోని2, 3, 4, 5 జోన్ల పరిధిలోని పలుప్రాంతాల్లో మంచినీటి సరఫరా ఆలస్యంగా జరుగుతుందని జివిఎంసి మంచినీటి సరఫరా నిర్వహణ విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు శేఖర్ ప్రకటనలో తెలిపారు. రెండవ జోన్ పరిధిలో మధురవాడ, పీఎం పాలెం, ఆరిలోవ సెక్టర్ 1 నుండి 12 వరకు, చినగదిలి, పెద్దగదిలి, విశాలాక్షినగర్, మూడువ జోన్ పరిధిలో చిన్న వాల్తేర్, పెద్ద వాల్తేర్, పాండురంగాపురం, రేశవానిపాలెం, పిఠాపురం కాలనీ, పీతలవానిపాలెం, శివాజీ పాలెం, మద్దిలపాలెం, చైతన్యనగర్, వినాయకనగర్, మంగాపురం కాలనీ, జాలారిపేట, ఆదర్శనగర్, వాసవానిపాలెం, ఎంవిపి సెక్టార్ 1 నుండి 12 వరకు, సీతమ్మపేట, అక్కయ్యపాలెం, లలిత నగర్, ఎన్జీవోస్ కాలనీ, శ్రీనివాస నగర్, నందగిరినగర్, నరసింహనగర్, గణేష్‌నగర్, నక్కవానిపాలెం, క్రాంతినగర్, గాంధీనగర్, సింహాద్రిపురం, లక్ష్మీ నరసింహనగర్, పాత వెంకోజిపాలెం, దుర్గా నగర్‌లోనూ, అలాగే నాలుగో జోన్ పరిధిలో వేలంపేట, టౌన్ మెయిన్ రోడ్, రంగిరీజు వీధి, మంతవారి వీధి, సున్నపు వీధి, రెల్లి వీధి, జబ్బర్‌తోట, చిలకపేట, అల్లిపురం ప్రధాన రహదారి, నేరెళ్ల కోనేరు, అమ్మవారి వీధి, కుమ్మరి వీధి, కొబ్బరి తోట, నేతాజీ నగర్, అంబేద్కర్ కాలనీ, జండా చెట్టు, కలెక్టర్ ఆఫీస్, దండు బజార్, జాలారిపేట, సాలిపేట, కేజీహెచ్, డాబాగార్డెన్, జగదాంబ, నీలమ్మ వీధిలోనూ, ఐదవజోన్ పరిధిలో రైల్వే న్యూకాలనీ, వెంకటేశ్వర కాలనీ, నరేంద్రనగర్, తాటిచెట్లపాలెం, సింగాలమ్మపురం, సింహగిరి కాలనీ, కైలాసపురం, సంజీవయ్య కాలనీ, కప్పరాడ, ధర్మానగర్, తిక్కవానిపాలెం, కంచరపాలెం, రామ్మూర్తి పంతులుపేట, సుభాష్‌నగర్, సిద్ధార్థనగర్, మహారాణివీధి, మర్రిపాలెం, కరాస, గౌరీనగర్, మురళినగర్ తదితర ప్రాంతాలలో తాగునీరు సరఫరా ఆలస్యంగా జరుగుతుందని, ఆయాప్రాంతాల ప్రజలు సహకరించాలని ఇఇ కోరారు.

యువశక్తిని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

-ఉద్యోగ ఉపాధి కల్పనలో విఫలం - సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య

ప్రజాశక్తి- కలెక్టరేట్ : కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలుయువశక్తిని నిర్వీర్యం చేస్తున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య మండిపడ్డారు. గురువారం అల్లిపురంలోనిమేకా సూరిబాబు భవన్ సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి సమావేశాల ప్రారంభంలో మాట్లాడుతూ, పరిశ్రమలు, ఆస్తులు అమ్మడమే తప్ప నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. తొమ్మిదేళ్ల బిజెపి పాలనలో, నాలుగున్నరేళ్ల వైసిపి హయాంలో ఎన్ని పరిశ్రమలను స్థాపించారో, ఎంతమందికి ఉద్యోగావకాశాలు కల్పించారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎంతోమంది త్యాగాల ఫలితంగా ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను కారుచౌకగా కార్పొరేట్లకు ధారదత్తం చేయాలని కేంద్రం కుట్రపన్నుతోందన్నారు.

ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ యువత ఇతర దేశాలకు, రాష్ట్రాలకు వలస పోతున్నా ప్రభుత్వానికి పట్టకపోవడం దుర్మార్గమన్నారు. గంజాయి సాగు, వాడకంలో దేశంలోనే ఎపి అగ్రస్థానంలో ఉండడం అత్యంత బాధాకరమన్నారు. సమావేశంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు, ఉపాధ్యక్షులు నాగరాముడు, సుబ్బారావు, సహాయ కార్యదర్శులు ద్రవిడ సురేష్, కత్తి రవి, వై.బాబీ, యుగంధర్, కారుమంచి, విశాఖ జిల్లా కార్యదర్శి వై. రాంబాబు పాల్గొన్నారు.

నైట్‌షెల్టర్ల స్థితిగతులపై సమీక్ష

ప్రజాశక్తి-కలెక్టరేట్ :నగర పరిధిలోని షెల్టర్ ఆపరేటింగ్, ఎన్‌జిఒలు, ఎనిమిది నైట్ షెల్టర్ల పనితీరుపై జివిఎంసి కమిషనర్ ఆదేశాలతో యుసిడి పీడీ పాపునాయుడు గురువారం సమీక్షించారు. నైట్ షెల్టర్ల భవనాల స్థితిగతులు, వాటికి అవసరమైన మరమ్మతులు, ఇతర అంశాలపై ఫొటోలతో సంక్షిప్త నివేదికను ఎయుటిడి సంస్థ ద్వారా అందజేయాలని నిర్వాహక స్వచ్ఛందసంస్థలను ఆదేశించారు. ఈనెల 10న ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం నిర్వహణపై చర్చించారు. ఎన్‌జిఒలు ప్రతివారం సమిష్టిగా ఒక ప్రణాళిక ప్రకారం రెస్క్యూ ఆపరేషన్ చేయాలని ఆదేశించారు.

23న తెలుగుశక్తి బహిరంగ చర్చావేదిక

ప్రజాశక్తి- కలెక్టరేట్: మంత్రి రోజాపై టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలపై నిజాలను నిర్ధారించుకునేందుకు ఈనెల 23న రామకృష్ణ బీచ్‌లో బహిరంగ చర్చావేదిక నిర్వహిస్తున్నట్లు తెలుగు శక్తి అధ్యక్షుడు బివి. రామ్ తెలిపారు. మహిళల సమక్షంలో నిర్వహించే బహిరంగ చర్చ వేదికకు వచ్చేందుకు బండారు సత్యనారాయణ అంగీకరించారన్నారు. రోజాను కూడా ఆహ్వానించామని, ఆమె వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రి రోజా, మాజీ మంత్రి బండారు ఎపిసోడ్‌లో వాస్తవాలను ప్రజలకు తెలియజెప్పేందుకు తెలుగుశక్తి ఆధ్వర్యాన ఈ బహిరంగ చర్చావేదిక నిర్వహిస్తున్నట్లు బివి.రామ్ వెల్లడించారు.

తారురోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : నగర ప్రజలకు మౌలిక వసతులు కల్పనకు జగనన్న ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. గురువారం 15వ వార్డు హెచ్.బి కాలనీ, సింహాద్రిపురంలో రూ.97 లక్షల వ్యయంతో తారురోడ్ల నిర్మాణానికి విశాఖ ఎంపీ, తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఎంవివి. సత్యనారాయణ, కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్యతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌సి విజయలక్ష్మి పాల్గొన్నారు.



ఏచూరికి స్వాగతం పలుకుతున్న నర్సింగరావు, లోకనాథం, జగ్గునాయుడు

ఉత్తేజంగా...

కూర్మన్నపాలెం సమీపాన ఉన్న స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద సిపిఎం ఆధ్వర్యాన గురువారం సాయంత్రం జరిగిన 'ఉక్కు రక్షణ బహిరంగ సభ'కు వేలాది మంది ప్రజలు తరలి వచ్చారు. ప్రజానాట్య మండలి కళాకారుల ప్రదర్శనలు చైతన్యం నింపాయి. వేదికపై ఉక్కు రక్షణ బైకు యాత్రలో పాల్గొన్న వారికి అతిథులు మెమోంటోలు అందజేశారు. ఉక్కు నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది.



బహిరంగ సభకు తరలివచ్చిన జన సందోహం



అనకాపల్లి నుంచి సభకు తరలి వెలుతున్న వికలాంగులు



ఆకట్టుకున్న డప్పు కళాకారుల ప్రదర్శన



అభివాదం చేస్తున్న సీతారాం ఏచూరి



కోలాటం ఆడుతున్న మహిళా కళాకారులు



ఏచూరితో శ్రీనివాసరావు, నర్సింగరావు, లోకనాథం మాటామంతి



సభలో మాట్లాడుతున్న ప్రభావతి



డ్యాన్స్‌లతో ఆకట్టుకున్న యువ కళాకారులు